సాక్షి ఖమ్మం

శనివారం । 13 । మే । 2023



రండీ.. ఎదగండి!

పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఉన్న అవకాశాలను ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. IIలో



రాష్ట్ర స్థాయి టోర్నీ ప్రారంభం

జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీని ఎంపీ నామా నాగేశ్వరరావు ప్రారంభించారు. IIలో

గరిష్టం / కనిష్టం
42° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రవుతుంది.

న్యూస్‌రీల్

పోలీసులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



పోలీసు ఉద్యోగులకు సూచనలు చేస్తున్న సీపీ వారియర్

మధిర/బోనకల్: పోలీస్ ఉద్యోగులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, తద్వారా కేసుల విచారణ, నిందితుల గుర్తింపు సులభమవుతుందని ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. మధిర టౌన్, బోనకల్ పోలీస్‌స్టేషన్లను శుక్రవారం సందర్శించిన ఆయన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కేసుల విచారణపై పలు సూచనలు చేసిన సీపీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పోలీసులపై నమ్మకంతో వచ్చే వారికి న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు. కాగా, ఈనెల 21న ఖమ్మంలో పోలీస్ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళా పోస్టర్లను సీపీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో వైరా ఏసీపీ రెహమాన్, మధిర సీఐ ఒడ్డేపల్లి మురళి, ఎస్సైలు సురేష్, కవిత పాల్గొన్నారు.

62,119 మె.టన్నుల ధాన్యం కొనుగోళ్లు

- అదనపు కలెక్టర్ మధుసూదన్



అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయని అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 236 కొనుగోలు కేంద్రాలను తెరవగా.. 160 కేంద్రాలకు ధాన్యం వస్తోందని పేర్కొన్నారు. ఈమేరకు 6,190మంది రైతుల నుంచి 62,119.480మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, మిల్లుల్లో స్థల సమస్య కారణంగా గోడౌన్లు, ఇతర జిల్లాలకు ధాన్యాన్ని తరలిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని యాదాద్రి భువనగిరి, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు తరలించినట్లు అదనపు కలెక్టర్ వివరించారు.

విధుల్లో చేరిన 80మంది జేపీఎస్‌లు

ఖమ్మం సహకారనగర్: సమస్యల పరిష్కారం కోసం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్)లు సమ్మె చేస్తుండగా రాష్ట్రప్రభుత్వం వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించింది. మంగళవారం సాయంత్రం వరకు గడువు విధించిన ప్రభుత్వం, విధుల్లో చేరని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈనేపథ్యాన జిల్లాలో శుక్రవారం వరకు 80మంది విధుల్లో చేరుతున్నట్లు లేఖలు ఇచ్చారని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ వీ.వీ.అప్పారావు తెలిపారు.

సమర్థవంతమైన న్యాయసేవలు అందించండి

ఖమ్మంలీగల్: ప్యానల్ న్యాయవాదులు సమర్థవంతమైన ఉచిత న్యాయ సేవలు అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా సూచించారు. ప్యానెల్ న్యాయవాదులతో శుక్రవారం సమావేశమైన ఆయన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన పథకాలపై అవగాహన కల్పించారు. కేవలం న్యాయసహాయానికి పరిమితం కాకుండా న్యాయసేవాధికార సంస్థ చేపట్టే అన్ని కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని సూచించారు.

పకడ్బందీగా సీఎం కప్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: సీఎం కప్ మండల, జిల్లా స్థాయి క్రీడాపోటీలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్, సీఎం కప్ చైర్మన్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లా వైస్ చైర్మన్‌గా సీపీ విష్ణు ఎస్.వారియర్, కో వైస్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్ స్నేహలత, మెంబర్లుగా కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రఘునందన్, పరిశ్రమల శాఖ జీఎం కె.అజయ్‌కుమార్, డీఈఓ సోమశేఖర్ శర్మ, కన్వీనర్‌గా డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. మండల స్థాయిలో పోటీల సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.



బోనకల్ మండలం చిరునోములకు చెందిన అయితపు సంతోష్‌కుమార్ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని నిర్ణయించి గూగుల్‌లో విద్యుత్ కార్యాలయం నంబర్ కోసం సెర్చ్ చేశాడు. అక్కడ కనిపించిన నంబర్‌కు ఫోన్ చేస్తే స్పందించిన ఓ వ్యక్తి తాను పంపించే లింక్ ద్వారా యాప్ డౌన్ లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేయాలని సూచించాడు. దీంతో సంతోష్‌కుమార్ అన్ని వివరాలు నమోదు చేయగా ఏప్రిల్ 16న ఆయన యూనియన్ బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.99,999, 17న 20,500 డ్రా అయ్యాయి. మెసేజ్‌లు రాగానే బ్యాంక్‌కు వెళ్లి సరిచూసుకున్న సంతోష్ మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు.

టెక్నిక్‌గా నొక్కేస్తున్నారు!

పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు

- రోజుకో కొత్త ఎత్తుగడతో దోపిడీ
- మాయమాటలతో ముగ్గులోకి దింపుతున్న సైబర్ నేరగాళ్లు
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ఉచ్చులో చిక్కుతున్న పలువురు

ఆన్‌లైన్ మోసాలపై కేసులు

ఏడాది	కేసులు	నష్టం
2022	218	రూ.2.90 కోట్లు
2023	82	రూ.1.05 కోట్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో సైబర్ నేరాలకు అంతు లేకుండా పోతోంది. ఆగంతకులు వివిధ రీతుల్లో మోసాలకు పాల్పడుతుండడంతో అడ్డుకట్ట వేయడం కష్టంగా మారుతోంది. సాంకేతికత అభివృద్ధి చెందిన నేపథ్యాన ఆన్‌లైన్ మోసాలు కూడా సులభమయ్యాయి. స్మార్ట్‌ఫోన్ వినియోగం ఎక్కువ కావడంతో ఈ మోసాలు అదే స్థాయిలో పెరుగుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.1.05 కోట్లు నష్టపోయినట్లుగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో ఆన్‌లైన్ మోసాలపై 82 కేసులు నమోదయ్యాయి. పోలీసులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నా కొందరి అమాయకత్వం కారణంగా మోసాల సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

సులభంగా మోసం..

నేటి ఆధునిక యుగంలో అందరి చేతుల్లో ఇంటర్నెట్‌తో కూడిన ఫోన్లు ఉండడంతో సైబర్ నేరగాళ్లు ప్రజల బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారు. అన్ని అవసరాలకు ఫోన్ ఉపయోగిస్తుండటంతో మోసం చేసేందుకు నేరగాళ్లకు అనుకూల వాతావరణం ఏర్పడుతోంది. పలువురికి సాంకేతికతపై అవగాహన లేక సైబర్ నేరగాళ్లు చెప్పే మాయమాటలు నమ్మేస్తున్నారు. గతంలో సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ ద్వారా పరిచయమై నేరాలకు పాల్పడేవారు. కానీ ఇప్పుడు వాట్సాప్‌లో చాటింగ్ రూపంలోనూ నమ్మబలికి మోసం చేస్తున్న ఘటనలు జిల్లాలో వెలుగుచూస్తున్నాయి.

అప్రమత్తంగా లేకపోతే అంతే

ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా ఉండేందుకు అప్రమత్తతే మార్గమని నిపుణులు చెబుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు ఎట్టి పరిస్థితుల్లో స్పందించకపోవడమే మేలని, సెల్‌ఫోన్‌కు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయొద్దని సూచిస్తున్నారు. మాయమాటలతో నమ్మబలుకుతున్న కొందరు బ్యాంకు అకౌంట్లు, ఆధార్ వివరాలు, ఓటీపీలు సేకరించి నిమిషాల వ్యవధిలోనే అకౌంట్ల నుంచి నగదు కాజేస్తున్నారు. తక్కువ ధరకు వస్తువులు లభిస్తాయని, కొద్దిపాటి పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని చెప్పే మాటలు నమ్మితే ఉన్న కొద్దిపాటి సొమ్ము కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

ఏ రీతిలోనైనా మోసం..

ఆన్‌లైన్ మోసాలకు నేరగాళ్లు రోజుకో కొత్త దారి ఎంచుకుంటున్నారు. తక్కువ వడ్డీకి వ్యక్తిగత రుణాలు ఇప్పిస్తామని బయోడేటా సేకరించి అకౌంట్ నుంచి నగదు లాగేస్తున్నారు. అలాగే మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా సేకరించే వివరాలతో చాటింగ్ చేస్తూ వ్యక్తిగత ఫొటోలు సేకరించడం ఆపై మోసాలకు తెర లేపడం సర్వసాధారణమైపోయింది. ఇక ఏదైనా అవసరాల కోసం గూగుల్‌లో వెతికితే తప్పుడు నంబర్లు కనిపించేలా చేయడం ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. వైరా ప్రాంతంలో ఈ ఏడాది ఫిబ్రవరి 26న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.43వేలు, మార్చి 22న మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.7.80 లక్షల మేరకు మోసపోయారంటే విద్యావంతులు, నిరక్షరాస్యులనే తేడా లేకుండా సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారని చెప్పొచ్చు.

అవగాహన కల్పించినా..

సైబర్ నేరాల బారిన పడకుండా పోలీసు శాఖ కళాజాత బృందాల ద్వారా అవగాహన కల్పిస్తోంది. నేరాల తీవ్రత, ఎలా కాపాడుకోవచ్చో వివరిస్తున్నారు. సెల్‌కు వచ్చే మెసేజ్‌లు పూర్తిగా పరిశీలించాకే స్పందించాలని, లేకుంటే మోసపోయినట్లేనని చెబుతున్నారు. అయినా పలువురు మోసపోతూనే ఉండడం గమనార్హం.

వెంటనే ఫిర్యాదు చేస్తే ఫలితం



ఆన్‌లైన్ ద్వారా మోసపోతే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేయడానికి, నగదు రికవరీ చేయడానికి అవకాశం ఉంటుంది. అలాగే, సైబర్ క్రైమ్ పరిధిలోని టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేయొచ్చు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించడం, కొన్ని యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవడంతో మోసాల బారిన పడే అవకాశముంది. ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైబర్ నేస్తం పేరుతో రోజుకు 1.20 లక్షల మందికి మెసేజ్ పంపిస్తున్నాం.

– విష్ణు ఎస్.వారియర్, పోలీస్ కమిషనర్

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు
- బోనకల్‌లో మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ నామా, డీసీసీబీ చైర్మన్ నాగభూషణం తదితరులు

బోనకల్: రైతుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి దేశానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. కాళేశ్వరం ద్వారా లక్షలాది ఎకరాల బీడు భూములను సాగులోకి తీసుకొచ్చారని.. రైతుల కోసం కేంద్రంలోని బీజేపీ, గతంలో పాలించిన కాంగ్రెస్ పార్టీలు ఏం చేశాయో చెప్పాలని సూచించారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో కల్లబొల్లి మాటలతో వచ్చే వారిని ప్రజలు నమ్మొద్దని కోరారు.

పేద ప్రజలకు అండగా ప్రభుత్వం

బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని ఎంపీ నామా నాగేశ్వరావు అన్నారు. బోనకల్ రైతువేదికలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మధిర, చింతకాని, బోనకల్, ఎర్రుపాలెం మండలాలకు చెందిన 100 మందికి రూ.26,47,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసి మాట్లాడారు. కాగా, తమకు రూ.26వేల కనీస వేతనం ఇప్పించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గ్రామదీపికలు ఎంపీ నామా నాగేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమాల్లో డీసీసీబీ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, జెడ్పీ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, కొండబాల కోటేశ్వరరావు, లింగాల కమల్‌రాజ్, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వర్లు, డీసీఓ విజయకుమారి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సునీత, సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్‌తో పాటు చావా వెంకటేశ్వరావు, చావా వెంకటేశ్వరరావు, మండెపూడి వెంకటేశ్వరావు, చేబ్రోలు మల్లికార్జున్, మోదుగు నాగేశ్వరావు, వేమూరి ప్రసాద్, బందం నాగేశ్వరావు, బందం శ్రీను, బానోతు కొండ పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ చేతికి ఆక్రమిత భూమి

- గాంధీచౌక్‌లో 1,750 గజాల భూమి స్వాధీనం
- విలువ రూ.17 కోట్ల పైమాటే...



ఖమ్మం గాంధీచౌక్‌లో అన్నదాన సత్రం స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు



అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని వ్యాపార కేంద్రమైన గాంధీచౌక్ సెంటర్‌లో ఇంతకాలం ఆక్రమణలో ఉన్న సుమారు రూ.17 కోట్ల విలువ చేసే 1,750 చదరపు గజాల భూమిని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వరంగల్‌కు చెందిన వ్యాపారి ఆకారపు నర్సింగం తెలుగు రాష్ట్రాల్లోనే కాక పూర్వపు మద్రాస్ రాష్ట్రంలోని పలుచోట్ల బ్రాహ్మణులు, వైశ్యుల భుక్తం కోసం 70 ఏళ్ల కిత్రం ఆకారపు నర్సింగం అన్నదాన సత్రం పేరిట భూములు కేటాయించారు. ఖమ్మం గాంధీ చౌక్ సెంటర్‌లోనూ ఇద్దరు బ్రాహ్మణులు, ఇద్దరు వైశ్యుల భుక్తి కోసం 1,750 చదరపు గజాలను కేటాయించగా, నర్సింగం మరణించాక ఆయన వారసులు భూమి తమకే చెందాలని కోర్టును ఆశ్రయించారు. అంతేకాక ఖమ్మంలోని ఆ స్థలంలో నిర్మించిన మూడు షట్టర్లతో కూడిన భవనం, ఖాళీ స్థలాన్ని అద్దెకు ఇచ్చారు. మొత్తంగా ఆయా భూములు, నిర్మాణాల ద్వారా నెలనెలా రూ.లక్ష వరకు అద్దె వస్తోంది.

ప్రభుత్వ ఉత్తర్వులతో స్వాధీనం

ఖమ్మంలోని అన్నదాన సత్రం భూమిని స్వాధీనం చేసుకోవాలని రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది మార్చి 16న ఉత్తర్వులు జారీ చేయగా అధికారులు శుక్రవారం అమలుచేశారు. దేవాదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు భూమిని పరిశీలించి స్థలం, నిర్మాణాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాక ఈ భూమి తమ ఆధీనంలోనే ఉంటుందని చెబుతూ వ్యాపారులకు నోటీసులు ఇచ్చారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగులు గౌరీశంకర్, సమత, చుండూరు రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అయితే, ఈ భూమి తమదేనని కోర్టును ఆశ్రయించిన వారు వరంగల్‌లో ఉన్నట్లు తెలుస్తుండగా, అధికారులు స్వాధీనం చేసుకున్న సమయాన వారెవరూ ఇక్కడకు రాలేదు.

ఈనెల 29న మెగా జాబ్‌మేళా

పోస్టర్లు ఆవిష్కరించిన మాజీ ఎంపీ పొంగులేటి



జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరెడ్డి, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 29న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. వందకు పైగా కంపెనీల బాధ్యులు పాల్గొననుండగా, పది వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో 29న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని, ఏడో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత ఉన్న వారికి ప్రతిభ ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్లు, బధిరులు, దివ్యాంగులకు కూడా అవకాశం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. వివరాల కోసం 96423 33667 96423 33668 నంబర్లలో సంప్రదించడమే కాక https:/seenannasainyam.com/home_page ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని పొంగులేటి సూచించారు.

క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ వీ.పీ.గౌతమ్



స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వారు క్రమబద్ధీకరించుకునేందుకు అమలవుతున్న 58, 59జీఓలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. నగరంలోని జగ్జీవన్‌రాం నగర్‌లో శుక్రవారం పర్యటించిన కలెక్టర్ ఆయా జీఓల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడారు. జీఓ 59 కింద దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వ సూచన మేరకు చెల్లించాల్సిన నగదులో మొదటి వాయిదా కడితే స్థలంపై హక్కులు సంక్రమిస్తాయని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో జీఓ 58 కింద 3,253, జీఓ 59 ద్వారా 2,559 దరఖాస్తులు ఆమోదించినట్లు ఆయన వివరించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్డీఓ రవీంద్రనాథ్, తహసీల్దార్ శైలజ పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్ల పరిశీలన



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్లు

చింతకాని: చింతకాని మండలం ప్రొద్దుటూరు, నాగిలిగొండ, కొణిజర్ల మండలం పెద్దగోపతి, అమ్మపాలెం గ్రామాల్లో దళితబంధు లబ్ధిదారులకు మంజూరైన యూనిట్లను ట్రెయినీ కలెక్టర్లు శుక్రవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో విత్తనాలను ఆరబెట్టే యంత్రం, డ్రోన్లు, పేపర్ ప్లేట్ల తయారీని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్వహణ, లాభాలు, జీవన స్థితిగతులపై వారు ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్నేహలత, సర్పంచ్‌లు చాట్ల సురేష్, తుడుం రాజేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నెమలి!



కలెక్టరేట్ ఆవరణలో నెమళ్లు తిరుగుతున్నాయి. గతంలో ఇక్కడ పొలాలు, వెనుక భాగాన అటవీ ప్రాంతం ఉండడంతో నెమళ్లు తిరిగేవని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు కలెక్టరేట్ నిర్మించినా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటగా వనంలా ఉండడంతో ఆవరణ, భవనంపై నెమళ్లు తిరుగుతుండగా ఉద్యోగులు తీసిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

– ఖమ్మం సహకారనగర్

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ కబడ్డీ పోటీలను శుక్రవారం సాయంత్రం ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రారంభించారు. దివంగత సీఎం ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, నిర్వాహక కమిటీ బాధ్యులు నల్లమల రంజిత్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.క్రిస్టోఫర్ బాబు, ఓలేటి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యతో ఆత్మహత్య

రఘునాథపాలెం: అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థికంగా ఇబ్బందులతో మండలంలోని రేగులచలకకు చెందిన కొర్లపాటి నాగరాజు(40) ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులందరూ చర్చికి వెళ్లగా గురువారం రాత్రి ఆయన ఉరి వేసుకున్నాడు. చర్చి నుంచి వచ్చాక గుర్తించిన కుటుంబీకులు ఆయనను ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

సత్తుపల్లిరూరల్: పంటచేనులో విద్యుద్ఘాతంతో రైతు మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం తుంబూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బత్తుల నాగరాజు(48) తన పొలంలో శుక్రవారం మిషన్‌తో వరి కోయిస్తున్నాడు. అయితే, గురువారం సాయంత్రం వీచిన గాలిదుమారానికి పొలంలో ఉన్న వ్యవసాయ మోటార్ సర్వీస్‌వైర్‌తో కలిసి ఉన్న జీ వైర్‌కు విద్యుత్ సరఫరా అయింది. ఈ విషయాన్ని గమనించిక ఆయన అడ్డుగా ఉన్న సర్వీస్ వైర్‌ను తొలగించే క్రమంలో షాక్‌కు గురయ్యాడు. దీంతో స్థానిక రైతులు నాగరాజును సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి వైద్యులు చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య వెంకటేశ్వరమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ



ఘటనాస్థలంలో ఆర్టీసీ బస్సు, కారు


నేలకొండపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం ఆర్టీసీ బస్సు, కారు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. కోదాడ నుంచి ఖమ్మం వెళ్తున్న కారు మండల కేంద్రంలో బౌద్ధక్షేత్రం క్రాస్ వద్దకు రాగానే టైర్ పగలడంతో పల్టీలు కొట్టింది. ఈక్రమంలోనే సూర్యాపేట జిల్లా నుంచి కోదాడ వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ కారును తప్పించే క్రమంలో కారును ఢీకొట్టాడు.ఈ ఘటనలో కారులో ఉన్న వారితో పాటు బస్సులో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. అయితే, బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించటంతోనే పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈఘటనతో ఖమ్మం–కోదాడ రహదారిపై వాహనాలు నిలిచిపోగా, పోలీసులు చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు.

షాపుకు వెళ్లివచ్చే లోగా చోరీ

కారేపల్లి: కారేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం తాళం వేసిన ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. స్థానిక పోస్టాఫీస్ రోడ్డులో నివాసముంటున్న చింత రాంబాబు దంపతులు శుక్రవారం ఉదయం పాల్వంచలోని తమ బంధువుల ఇంట్లో వివాహానికి, వీరి కుమారుడు సాయి మెయిన్ రోడ్డులోని మెకానిక్ షాపుకు వెళ్లారు. సాయి తిరిగి 11.30 గంటలకు ఇంటికి వచ్చేలోగా తాళం పగలగొట్టి ఉండటం, బీరువా తెరిచి ఉండడంతో పాటు చోరీ జరిగినట్లు గుర్తించి పరిశీలించగా తులం బంగారం ఆభరణం, కొన్ని వెండి వస్తువులతో పాటు రూ.20వేల నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్‌ఐ పి.రామారావు పరిశీలించి సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

ఆరు అడుగుల స్థలం కోసం ఘర్షణ

చింతకాని: మండలంలోని నేరడలో మృతి చెందిన వృద్ధురాలి దహన సంస్కారాల విషయంలో శుక్రవారం వివాదం నెలకొనగా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రామానికి చెందిన కోట రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె దహన సంస్కారాల కోసం గుంత తీసే క్రమంలో వివాదం నెలకొంది. ఆ స్థలం తన పట్టా భూమిలో ఉందని కిన్నెర ప్రసాద్ కుటుంబసభ్యులు అడ్డుచెప్పగా, ఆగకుండా గుంత తీశారు. అంతేకాక కిన్నెర ప్రసాద్, ఆయన భార్య, వదినపై మురళి తదితరులు దాడి చేయగా ప్రసాద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.14,205

రండీ.. పారిశ్రామిక వేత్తలుగా ఎదగండి

- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై ప్రభుత్వ సబ్సిడీ
- వ్యక్తిగతంగా, గ్రూప్‌గా ఏర్పాటు చేసుకున్నా వర్తింపు
- ఫుడ్ ప్రాసెసింగ్ ఎక్స్‌పోలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్



ఎక్స్‌పోలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అధికారులు

ఖమ్మంఅర్బన్: ఔత్సాహికులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో అందుబాటులోకి వచ్చిన అధునాతన యంత్రాలపై సబ్సిడీ కూడా లభిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి పథకం – తయారీ సంస్థల క్రమబద్ధీకరణ కింద జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ ఎక్స్‌పోను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడుతూ ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల కింద తోడ్పాటును అందిస్తున్నాయని తెలిపారు. ఔత్సాహికులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని పరిశ్రమలను ఏర్పాటుచేస్తే మరికొందరికి ఉపాధి కల్పించొచ్చని చెప్పారు. అర్హులైన వారికి ప్రభుత్వం 35 శాతం సబ్సిడీతో కూడిన రుణాన్ని మంజూరు చేస్తుందని, స్వయం సహాయక సంఘాల సభ్యులు డ్రోన్లు, హార్వెస్టర్ తీసుకొని అద్దెకు ఇస్తూ ఆదాయం పొందొచ్చని తెలిపారు. ఇంకా ఇళ్లలోనూ ఏర్పాటుచేసుకోగలిగితే మినీ రైస్ మిల్, దాల్ మిల్, కారంపొడి తయారీ తదితర యూనిట్లు ఉన్నాయని చెప్పారు. పది శాతం లబ్ధిదారుల వాటా, 35 శాతం సబ్సిడీ, 55 శాతం బ్యాంకు రుణంతో పరిశ్రమ స్థాపించుకోవచ్చని, వ్యక్తిగతంగా రూ.16లక్షల వరకు, గ్రూపుగా రూ.4 కోట్ల వరకు రుణాలు లభిస్తాయని వివరించారు. ఖమ్మంలో చైనాకు చెందిన కంపెనీ కారంపొడి ఫ్యాక్టరీని ఏర్పాటుచేసినప్పుడు స్థానికులు ఎందుకు ఏర్పాటుచేయలేరని ప్రశ్నించారు. అనంతరం వివిధ యంత్రాల తయారీదారులు, అధికారులు ఎక్స్‌పోకు వచ్చిన వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిశ్రమల శాఖ జీఎంలు అజయ్‌కుమార్, సీతారాం, ఖమ్మం డీఆర్డీఓ విద్యాచందన, భద్రాద్రి కొత్తగూడెం ఎల్‌డీఎం రాంరెడ్డి, రాష్ట్ర ఫుడ్ ప్రాసెస్సింగ్ సొసైటీ ప్రతినిధి సంజీవ్, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న ఔత్సాహికులు

ఆసక్తిగా ఆరా తీస్తూ...

ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఏర్పాటుచేసిన ఎక్స్‌పోకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు హాజరై ఇక్కడి యంత్రాలను పరిశీలించారు. వీటి పనితీరు, ధర, లాభాలు, నిర్వహణపై కంపెనీల బాధ్యులతో చర్చించారు. ఈసందర్భంగా ఎక్స్‌పోలో గంటకు 30నుంచి 50కేజీల ఎల్లిపాయలు వలిచి ముక్కలు చేసే యంత్రం(ధర రూ.2లక్షల నుండి రూ.3 లక్షల వరకు), చేతులతో చేసే పని లేకుండా గంటకు 30కేజీల వరకు పిండివంటలు తయారు చేసే యంత్రం(ధర రూ.2లక్షలు), ఇంట్లోనే గంటకు ఐదు కేజీల వరకు పల్లి, నువ్వుల నూనె తీయగలిగే యంత్రం(ధర రూ.15 వేల నుండి రూ.10 లక్షల వరకు)ను పలువురు ఆసక్తిగా పరిశీలించారు.



పిండి వంటల తయారీ యంత్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ఇంట్లోనే యూనిట్ ఏర్పాటు చేయాలని..



రూ.2లక్షలలోపు యూనిట్‌ను ఇంట్లోనే ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందాలనేది ఆలోచన. ఈ ఎక్స్‌పోలో అనేక రకాల యంత్రాలను అందుబాటులో ఉంచారు. ఆయా కంపెనీలో మాట్లాడి వివరాలు తెలుసుకున్నాను. అధికారులతో మాట్లాడాక ఏ యూనిట్ ఏర్పాటుచేయాలనేది నిర్ణయించుకుంటా.

– ఎం.స్టాలిన్ తమ్మినేనిపాలెం, చింతకాని

పిండి వంటల తయారీ కోసం..



ఇప్పటి వరకు ఇంట్లోనే వివిధ రకాల పిండి వంటలు తయారుచేసి అమ్ముతూ ఉపాధి పొందుతున్నాను. కానీ కష్టం తగ్గించుకుని, ఎక్కువ ఉత్పత్తి చేయాలంటూ యంత్రాలు అవసరమని తెలిసింది. అందుకే ఇక్కడ యంత్రం ద్వారా పిండి వంటల తయారచేయగలిగే యంత్రం వివరాలు తెలుసుకున్నా.

– కవిత, కొత్తగూడెం

సత్తుపల్లి రూరల్ సీఐ హనోక్‌కు అవార్డు



హోంమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న సీఐ

పెనుబల్లి: పోలీస్ శాఖలో ఉత్తమ సేవలందించిన సత్తుపల్లి రూరల్ సీఐ సీహెచ్.హనూక్‌కు అవార్డు లభించింది. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనీకుమార్ ఆయనకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సీఐకి వీఎం.బంజర్, కల్లూరు, వేంసూరు ఎస్సైలు జి.సూరజ్, రఘు, జె.సురేష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం, ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించేది లేదు

వైరా ఎమ్మెల్యే రాములునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములు నాయక్, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: సీఎం కేసీఆర్‌ను, తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించేది లేదని, వారికి తగిన బుద్ధి చెబు తామని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ హెచ్చరించారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన మాజీ ఎంపీ రవీంద్రనాయక్ విచక్షణ కోల్పోయి సీఎం, ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. దేశమంతా తెలంగాణ రాష్ట్రాన్ని, ప్రభుత్వపథకాలను ప్రశంసిస్తుంటే బీజేపీ నాయకులు మాత్రం అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. అరవై లక్షల పైచిలుకు సభ్యత్వం కలిగిన తమ పార్టీ అధినేతపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో వారికి ఎలా బుద్ధి చెప్పాలో తమకు తెలుసునని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ నేతృత్వాన గిరిజనులు, బంజారాలు, ఆదివాసీలకు సముచిత గౌరవం దక్కిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు చందూలాల్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సమస్యలపై నిరంతర పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

తిరుమలాయపాలెం: పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతర పోరాటాలు సాగిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. తిరుమలాయపాలెం మండలం కారవాయిలో పార్టీ నాయకుడు దంతాల బాలరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన సీపీఐ ఏనాడు కూడా ఓట్లు, సీట్ల కోసం కాకుండా పేదల సమస్యల పరిష్కారమే అజెండాగా ఉద్యమించిందని తెలిపారు. కానీ పేదల సమస్యలపై చట్టాలు జరగాలంటే అసెంబ్లీలో కమ్యూనిస్టులు ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మాట్లాడగా నాయకులు మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్ రెడ్డి, తోట రామాంజనేయులు, బత్తుల రాధాకృష్ణ, బానోత్ నర్సింహ, కొండా సోమయ్య, ఇంటూరి వెంకటేశ్వర్లు, బండారి పుల్లారెడ్డి, చీమ రామకృష్ణ, భూక్యా శ్రీను, పిల్లలమర్రి మహేష్, దారావత్ రోజా, నల్లగట్ల సరోజ, భూక్యా వీరస్వామి పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'ప్రైవేట్' ప్రతిభ



పదో తరగతి విద్యార్థులను అభినందిస్తున్న రవిమారుత్, పార్వతీరెడ్డి

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) ఆధ్వర్యాన నిర్వహించిన పదో తరగతి, ప్లస్–2 ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. ఈ సందర్భంగా జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆయా విద్యార్థులను యాజమాన్యాలు, ఉపాధ్యాయులు అభినందించి వివరాలను వెల్లడించారు.

● హార్వెస్ట్ విజయదుందుభి

ఖమ్మం సహకారనగర్: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయదుందుభి మోగించారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాలు శుక్రవారం వెల్లడించగా వారు విద్యార్థులను అభినందించి మాట్లాడారు. తమ పాఠశాల నుంచి 273మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా నూరు శాతం ఫలితాలు నమోదయ్యాయని తెలిపారు. ఇందులో 500మార్కులకు పి.ప్రణవ్ 494మార్కులు, బుడిగం జస్రాజ్ హరికృష్ణ 464, బి.సిద్ధార్థ 492, ఆర్.వెంకటసాయివంశీ 491, ఎం.నిహారిక 489, డి.నిషిత 489, పి.రోహిత్ 488, బి.భార్గవి 487, ఎన్‌సీహెచ్.జశ్వంత్ సాయి 486, జి.జశ్వంత్ 486మార్కులు సాధించారని వెల్లడించారు.

● ప్లస్–2లో హార్వెస్ట్ విజయకేతనం

సీబీఎస్ఈ 12వ తరగతి(ప్లస్–2) ఫలితాల్లో తమ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. ఈమేరకు విద్యార్థులను అభినందించాక వారు మాట్లాడుతూ 500మార్కులకు పి.మానస 483మార్కులు సాధించి మొదటిస్థానంలో నిలవగా, అక్షర సంక్రాంతి 475, పి.లతాశ్రీ 469, జె.జ్యోతిక 469, పి.శివలాస్య 467, తనుష్కపతానీ 465, ఉదారపు మోహన్ సాయి 464, వి.గాయత్రి కృష్ణ 464, ఏ.త్రినాథ్ 463, సీహెచ్.షణ్ముఖ నిరూప్ 462మార్కులు సాధించారని పేర్కొన్నారు. అన్ని సబ్జెక్ట్‌ల్లోనూ తమ విద్యార్థులు అధిక మార్కులు నమోదు చేయగా, పి.మానస, అక్షర సంక్రాంతి, పి.లతాశ్రీలు అన్ని సబ్జెక్ట్‌ల్లో ఏ గ్రేడ్ సాధించారని తెలిపారు.



ప్లస్–2 విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్లు

● న్యూలిటిల్ ఫ్లవర్స్ ప్రతిభ

వైరా: సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షా ఫలితాలలో వైరాలోని న్యూఇరా విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారని చైర్మన్ ఐ.వీ.రమణారావు తెలిపారు. వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాల విద్యార్థి ఊరుకొండ కుశాల్ 500 మార్కులకు 489 మార్కులు, ఎం.నాగయశ్వంత్ 488, డి.నిఖిల్ 479, ఆర్.షణ్ముఖప్రియ 478, బి.ధనుష్ 477 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు డాక్టర్ పి.భూమేశ్వరరావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్‌రావు, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ అభినందించారు.

● శ్రీచైతన్య సత్తా

ఖమ్మం సహకారనగర్: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ఖమ్మం మమత రోడ్డులోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాల సత్తా చాటారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 500 మార్కులకు గాను యశస్విని 487 మార్కులు, షర్మిత 483, నిహాల్ 475, శ్రీజ 475, శౌర్యన్ రాయ్ 472, జాహ్నవి 470, యశ్మిత్ 469, ప్రేమ్‌సాయి 466, స్రవంతి 460మార్కులు సాధించగా, 22మంది విద్యార్థులు 450కుపైగా మార్కులు సాధించారని తెలిపారు. ఈసమావేశంలో డీజీఎం చేతన్, జయప్రకాష్, ప్రిన్సిపాళ్లు నాగప్రవీణ, టీఎల్ ఎన్.శర్మ, వైస్ ప్రిన్సిపాళ్లు సురేష్, రామకృష్ణారెడ్డి, డీన్ విష్ణు, కేవీఆర్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న యజమాన్యం

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమ



● రెజొనెన్స్ శ్రీనివాసనగర్..

సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని రెజొనెన్స్ శ్రీనివాసనగర్ డైరెక్టర్లు ఆర్.వీ.నాగేంద్రకుమార్, కొలిపర నీలిమ తెలిపారు. విద్యార్థులను వారు అభినందించి మాట్లాడుతూ 500మార్కులకు వి.నవీన్, కె.వెన్నెల 472మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, ఎం.జీవన్ రాజ్ 467, సాయి మనోజ్ఞ 441, వి.హర్షిత్ 438, పి.సుమంత్ 433, సీహెచ్.జశ్వంత్ 428, ఎన్.హారిక 425, వీహెచ్.గణేష్ 420, జనని 419, ధనుష్ 41మార్కులు, 400కుపైగా మార్కులు 11మంది సాధించారని వెల్లడించారు.

● బ్లూమింగ్ మైండ్స్ విజయకేతనం



విద్యార్థులతో చైర్మన్, కరస్పాండెంట్ తదితరులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ పాఠశాల విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో విజయకేతనం ఎగుర వేసినట్లు కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో నూరు శాతం ఫలితాలు నమోదు కాగా, ఎస్.కే.యాస్మిన్ 490 మార్కులు, టోనీష్‌కు 486, కె.హర్షవర్ధన్‌కు 483, యశ్వంత్‌కు 483 మార్కులు సాధించగా, 90శాతానికి పైగా ఐదుగురు, 80శాతం పైగా 20మంది, 70శాతానికి పైగా మార్కులతో 28మంది, 60శాతం మా ర్కులతో 28మంది, 50శాతం పైగా మార్కులతో 12మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను చైర్మన్ బి.సత్యనారాయణరెడ్డి, కరస్పాండెంట్ అశోక్‌రెడ్డితో పాటు ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

● శ్రీవిద్యానికేతన్ విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రాంప్రసాద్

సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని శ్రీవిద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ గొల్ల పుడి రాంప్రసాద్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం విద్యార్థులను ఆయన మాట్లాడుతూ 500మార్కులకు గాను ఎస్.ప్రవీణ్ 425మార్కులు, డి.ఆదిత్య 420, కె.విఘ్నేష్ 419 మార్కులు సాధించగా, మిగతా వారు అత్యుత్తమ మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21న ఖమ్మంలో పొంగులేటి ఆత్మీయ సమ్మేళనం

14న వనపర్తిలో సమ్మేళనానికి హాజరు

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన ఖమ్మం నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని ఈనెల 21న ఆదివారం నిర్వహించనున్నారు. తొలుత 14వ తేదీన సమ్మేళనం జరుగుతుందని ప్రకటించినా, అదేరోజు వనపర్తి జిల్లాలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తుండడం, ఆ కార్యక్రమానికి పొంగులేటి హాజరుకానుండడంతో ఖమ్మం సభను వాయిదా వేశారు. ఈమేరకు 21న సాయంత్రం ఐదు గంటలకు వైరారోడ్డులోని ఎస్‌ఆర్ గార్డెన్స్ వెనుకాల సాయంత్రం ఐదు గంటలకు మొదలయ్యే సమ్మేళనానికి ఖమ్మం నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి కోరారు.

నేడు జిల్లాలో పొంగులేటి పర్యటన

ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం, ఖమ్మంరూరల్, రఘునాథపాలెం, పెనుబల్లి, వేంసూరు, కల్లూరు, వైరా తదితర మండలాల్లో ఆయన పర్యటిస్తారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి తెలిపారు.

సేవ చేసే అవకాశమిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు

ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సోమేశ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్‌: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుగా మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని ఆరో అంతస్తులో తనకు కేటాయించిన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్రానికి సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సచివాలయంలోని అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీ కొత్త నిబంధనలపై అవగాహన సదస్సు

సాక్షి, హైదరాబాద్‌: పన్ను మినహాయింపు నిబంధనల్లో వచ్చిన మార్పులను పన్ను చెల్లింపుదారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు గమనించాలని న్యూఢిల్లీ చీఫ్ కమిషనర్ (మినహాయింపులు) రేణు జౌహ్రీ సూచించారు. ఆదాయపు పన్ను మినహాయింపులో కొత్త, సవరించిన నిబంధనలను వివరించడానికి, హైదరాబాద్ ఏసీగార్డ్స్‌లోని ఆదాయపు పన్ను టవర్స్‌లో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేణు జౌహ్రీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్నులో మినహాయింపు సెక్షన్లలో తెచ్చిన కొత్త నిబంధనలు, సవరణలను తెలిపారు. నాన్ ప్రాఫిటబుల్ ఆర్గనైజేషన్స్ (ఎన్‌పీఓ)ల నమోదులో ఏప్రిల్ 1 నుంచి కొత్త విధానం ప్రారంభమైందని, ఇప్పటికే ఉన్న ఎన్‌పీఓలు, కొత్త ఎన్‌పీఓలు ఏదైనా మినహాయింపును క్లెయిమ్ చేయడానికి కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. కొత్త నిబంధనల ప్రకారం, నిర్దిష్ట ఉల్లంఘనలకు పాల్పడితే రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుందని స్పష్టం చేశారు. మినహాయింపును క్లెయిమ్ చేయడానికి, ఆదాయ రిటర్న్‌ను దాఖలు చేయడం తప్పనిసరని, అవసరమైన ఆడిట్ నివేదికలు, ఇతర నివేదికలను సమయానుకూలంగా సమర్పించాలని వెల్లడించారు. కార్యక్రమంలో జేసీఐటీ (మినహాయింపులు) వి.కోటేశ్వరమ్మ, డీసీఐటీ (మినహాయింపులు) సుధా కొరివి, డీసీఐటీ (మినహాయింపులు) ధృవాష్ఠ, ఆదాయపు పన్ను అధికారులు, పన్ను బార్ అసోసియేషన్ సభ్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

అధ్యాపకుడు మధుసూదన్ రెడ్డిని తొలగించండి

ప్రభుత్వానికి ఇంటర్ బోర్డ్ కార్యదర్శి సిఫార్సు

సాక్షి, హైదరాబాద్‌: సస్పెండైన సరూర్‌నగర్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు పి.మధుసూదన్ రెడ్డిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని ప్రభుత్వానికి ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ సిఫార్సు చేశారు. మధుసూదన్ రెడ్డిపై అవినీతితో పాటు, బాధ్యతారాహిత్యం, విధుల్లో క్రమశిక్షణ రాహిత్యం, ఉద్యోగులను బెదిరించడం, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆయనను విధుల నుంచి తొలగించడం సరైన నిర్ణయమని ప్రభుత్వ కార్యదర్శికి పంపిన ఫైల్‌లో నవీన్ మిత్తల్ పేర్కొన్నారు.

ఐసీఐడీ వేదికలో భాగస్వామి కండి

సాక్షి, హైదరాబాద్‌: వ్యవసాయ సాగులో నీటి ఎద్దడి నివారణ అనే థీమ్‌తో నవంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ ఇరిగేషన్, డ్రైనేజీ కమిషన్ (ఐసీఐడీ) అంతర్జాతీయ కాంగ్రెస్‌లో భాగస్వామి కావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఐసీఐడీ ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఈఎన్‌సీ మురళీధర్‌ను కలిసి సమావేశం వివరాలను తెలిపారు. 57 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత భారతదేశానికి ఈ అవకాశం వచ్చిందని, విశాఖ వేదిక కానుందని పేర్కొన్నారు.

కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురండి

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజుల వసూళ్లను అరికట్టేందుకు కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని భారతీయ జనతా యువమోర్చా డిమాండ్ చేసింది. ఫీజు రెగ్యులేటరీ కమిటీలను బలోపేతం చేసి ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం రూపొందించిన నివేదికతో ప్రైవేట్ సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్మోహన్‌కు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ ఆధ్వర్యంలోని బృందం వినతి పత్రం సమర్పించింది.


కాలులేని భార్యను భుజంపై మోసుకొని..

వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్‌లేక రోగి అవస్థ • చికిత్సకు వచ్చి వెళ్లే క్రమంలో ఘటన • సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్ అందుబాటులో లేక ఓ వృద్ధుడు తన భార్యను చికిత్స అనంతరం భుజాలపై మోసుకెళ్లిన ఘటన శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. భద్రాది కొత్తగూడెం జిల్లాకు చెందిన మాలోతు లక్ష్మికి నవంబర్‌లో కుడికాలి రక్తప్రసరణ ఆగిపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మోకాలు కింద నుంచి కాలును తొలగించారు. రోగిని 15 రోజులకోసారి డ్రెస్సింగ్ కోసం తీసుకురావాలని సూచించారు. ఈ క్రమంలో శుక్రవారం లక్ష్మిని ఆమె భర్త ఆస్పత్రికి తీసుకువచ్చాడు. అక్కడున్న సిబ్బంది 'పెద్ద సార్ లేరు.. రేపు రావాలని చెప్పారు. అయితే ఆ సమయంలో స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడంతో భుజాలపై మోసుకుంటూ మండుతున్న ఎండలోనే బయటకు తీసుకెళ్లాడు. ఈ ఘటనపై ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ స్పందించారు. డ్రెస్సింగ్ అనంతరం పేషెంట్ కేర్ సిబ్బంది రోగిని వీల్‌చైర్‌లో క్యాజువాలిటీ నుంచి బయటకు తీసుకొచ్చారని తెలిపారు. కాలిపర్ (కాలుకు అమర్చే లోహ పరికరం) సేవల కోసం వెళ్లగా శనివారం అందుబాటులో ఉంటుందని, అప్పుడు రావాలని సిబ్బంది చెప్పారన్నారు. దీంతో తిరిగి వెళ్లే క్రమంలో ఎండ తీవ్రత దృష్ట్యా భర్త తన భార్యను ఒక చెట్టు వద్దకు తీసుకెళ్లేందుకు భుజంపై ఎక్కించుకొని వెళ్తుండగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. ఇలాంటి ఘటనలతో ఆస్పత్రిని అభాసుపాలు చేయవద్దని కోరారు.

టుడేస్ గ్రాఫిక్

మీకో విషయం తెలుసా? ప్రతి నాలుగు నిమిషాలకు ఈ భూమ్మీద వెయ్యి మంది పుడతారట. అయితే, ఆ వెయ్యి మందిలో ఏ దేశంలో ఎంత మంది జన్మిస్తారు? అల్రెడీ జనాభాలో నంబర్ వన్‌గా ఉన్న మనం.. ఈ విషయంలోనూ మొదటి స్థానంలోనే ఉన్నాం. వచ్చే నాలుగు నిమిషాల్లో ఆ వెయ్యిమందిలో 172 మంది భారత్‌లోనే పుడతారట. మరి మిగతా దేశాల సంగతేంటో.. ఓసారి చూద్దామా..



అడవులు కేంద్రంగా ఉగ్రవాద శిక్షణ

సాక్షి, హైదరాబాద్‌: నగరంతో పాటు భోపాల్‌లో పట్టుబడిన 16 మంది ఉగ్రవాదులు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాల్లోనే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. నగర శివార్లలో ఉన్న వికారాబాద్‌లోని అనంతగిరి అడవుల మాదిరిగానే భోపాల్ సరిహద్దుల్లోని రైసెన్ అడవిని ఎంచుకున్నట్లు ఏటీఎస్ అధికారులు నిర్ధారించారు. అక్కడ అరెస్టయిన 11 మందితో పాటు నగరంలో చిక్కిన ఐదుగురినీ ప్రస్తుతం ఏటీఎస్ తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. –భోపాల్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సయ్యద్ దానిష్ అలీ ఇంటిలో సూత్రధారి యాసిర్ ఖాన్ నిర్వహించిన సమావేశాలకు నగరం నుంచి సలీంతో పాటు అబ్దుల్ రెహ్మాన్, షేక్ జునైద్ కూడా హాజరయ్యారని ఏటీఎస్ చెప్తోంది. దానికి సంబంధించిన ఆధారాలు సైతం తమకు లభించినట్లు స్పష్టం చేస్తోంది. గోల్కొండలోని సలీం నివాసంలో ఎయిర్ పిస్టల్, పిల్లెట్స్, భోపాల్‌లోని యాసిర్ ఇంటి నుంచి నాటు తుపాకీ, తూటాలు సీజ్ చేశారు. ఈ నాటు తుపాకీ సేకరించింది, భోపాల్ మాడ్యుల్‌కు శిక్షణ ఇచ్చింది కూడా సలీం అని ఏటీఎస్ అనుమానిస్తోంది. ఆ కోణంలో అతడిని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.

- ఆయుధాలు సమీకరించింది మహ్మద్ సలీం
- అక్కడి బృందానికీ ఇతడి ద్వారానే శిక్షణ
- ఈ ఐదుగురి నుంచి విదేశాలకు ఫోన్ కాల్స్



నగరంలో అరెస్టు చేసిన ఐదుగురినీ భోపాల్ కోర్టులో హాజరుపరుస్తున్న ఏటీఎస్

విదేశీ నంబర్లకు ఫోన్లపై ఆరా

నగర మాడ్యుల్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ఫోన్ల నుంచి విదేశీ నెంబర్లకు ఫోన్లు వెళ్లినట్లు అనుమానిస్తున్న దర్యాప్తు అధికారులు వాటి వివరాలు ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వీరికి విదేశాల్లో ఉన్న వారితో ఉన్న సంబంధాల పైనా దర్యాప్తు చేయనున్నారు. ఉగ్రవాద సాహిత్యాన్ని తన ల్యాప్‌టాప్ వినియోగించి సొంతంగా తయారు చేసిన సలీం అందులో అనేక అంశాలు చేర్చాడు. ఆన్‌లైన్‌లో ఉన్న విషయాలతో పాటు వివిధ పుస్తకాల్లోని అంశాలు క్రోడీకరించి రూపొందించిన ఇందులో జిహాద్, ముజాహిదీన్ అంటే ఏమిటి? తాము ఏం చేయాలి? అనే వివరాలతో పాటు ఉగ్రవాద చర్యల్లో పాల్గొంటూ చనిపోయిన వారి కుటుంబాలను ఎలా ఆదుకోవాలి? ఎలాంటి ఆయుధాలు సమీకరించుకోవాలి? క్యాడర్‌ను ఎలా రిక్రూట్ చేసుకోవాలి? తదితర వివరాలు పొందుపరిచాడు.

ఈ కేసులో సాక్షులుగా 'వారు'

సలీం, రెహ్మాన్ గతంలో మరికొందరిని ఆకర్షించారు. వీళ్లు కేవలం మతపరమైన కార్యక్రమాలు చేపడుతున్నారని భావించిన వాళ్లు కొన్ని సమావేశాలకు హాజరయ్యారు. అయితే కొన్నాళ్లకే వీరి వ్యవహారశైలి, కార్యకలాపాలు అనుమానాస్పదంగా భావించిన వారంతా దూరయమ్యారు. వీరిని గుర్తించి, ఈ కేసులో సాక్షులుగా మార్చాలని పోలీసులు భావిస్తున్నారు.

ముగ్గురి ఇళ్లకు సీసీ కెమెరాలు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో చిక్కిన ఐదుగురి ఉగ్రవాదుల్లో ముగ్గురి ఇళ్లకు బయట సీసీ కెమెరాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఏటీఎస్ అధికారులు, పోలీసులు దాడి చేయడానికి వచ్చారనే విషయం వీటిలో చూసి వాళ్లు గుర్తించారు. దీంతో ఉగ్రవాద సాహిత్యం దొరక్కుండా చేయడానికి ప్రయత్నాలు చేశారు.

ఈనెల 15 నుంచి సీఎం కప్

- పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్రీడలు
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకేనన్న శాట్స్ చైర్మన్

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్–2023 పేరిట ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో క్రీడా సంబరాలను నిర్వహించనుంది. ఈనెల 15 నుంచి 31వరకు వివిధ క్రీడా పోటీలు జరగనున్నాయి.15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల వయస్సుగల పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించే క్రీడలు, వాటి నిర్వహణ, అందులో ఎవరెవరు ఉండాలనే అంశాలను రాష్ట్ర క్రీడా ప్రాదిరాన సంస్థ (శాట్స్) విడుదల చేసింది.

నిర్వహించనున్న క్రీడలు.. : ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో, 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. 28 నుంచి 31 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. మండల స్థాయిలో మహిళలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు ఉంటాయి. పురుషులకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, ఈత పోటీలు నిర్వహించనున్నారు. క్రీడల నిర్వహణకు మండల స్థాయికి రూ.15 వేలు, జిల్లా స్థాయికి రూ.75 ఇవ్వనున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఔత్సాహికుల నుంచి నిధులను సమకూర్చుకోవచ్చు.

నగదు ప్రోత్సాహకాలు..

రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు అందజేస్తారు. వ్యక్తిగత క్రీడల్లో బహుమతిగా ప్రథమ–రూ.20 వేలు, ద్వితీయ–రూ.15 వేలు, తృతీయ–రూ.10 వేల నగదు అందజేయనున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలనూ అందజేస్తారు. క్రీడల్లో పాల్గొనాలనుకునేవారు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు.

బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా!

- తాళి కట్టేందుకు మొండికేసిన వరుడు
- బైక్‌కు డబ్బులిచ్చి.. పెళ్లికి ఒప్పించిన ఎమ్మెల్యే రసమయి
- కరీంనగర్ జిల్లాలో ఘటన



శంకరపట్నం(మానకొండూర్): పెళ్లికూతురు మెడలో తాళి కట్టే సమయానికి బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు మొండికేయడంతో అతిథిగా వెళ్లిన ఎమ్మెల్యే తానుబండి కొనిస్తా అని డబ్బులు ఇచ్చి వివాహంజరిపించిన ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్‌లో చోటుచేసుకుంది. శంకరపట్నం మండలం అంబాల్‌పూర్ మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ, మాజీ ఉపసర్పంచ్ మల్లయ్య కూతురు అనూష వివాహం సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన సంఘాల వినయ్‌తో కుదిరింది. రూ.5 లక్షల కట్నంతో పాటు మోటార్ సైకిల్ కొనిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. కట్నం డబ్బులు ముట్టచెప్పారు. మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పెళ్లి మండపానికి వధువు, వరుడి బంధువులు చేరుకున్నారు. కొత్తజంటను ఆశీర్వదించేందుకు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కూడా హాజరయ్యారు. తీరా.. తాళికట్టే సమయంలో మోటార్ సైకిల్ కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు వినయ్ మొండికేశాడు. దీంతో వరుడు, వధువు బంధువులు గొడవకు దిగడంతో ఎమ్మెల్యే రసమయి జోక్యం చేసుకుని పెళ్లి కొడుకు వినయ్‌తో మాట్లాడి మోటార్ సైకిల్ కొనుక్కోమని సొంత డబ్బులను (సుమారు రూ.50వేలు) అప్పటికప్పుడే పందిట్లోనే అందించారు. మిగతా సొమ్ము కూడా తానే ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దగ్గరుండి వివాహం జరిపించి నూతన జంటను ఆశీర్వదించారు. తోడబుట్టిన అన్నగా పెళ్లి మండపంలో పరువు కాపాడావని మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ కన్నీరు పెట్టుకుంది.

జిల్లా వార్తలు

ప్రపంచ షూటింగ్ టోర్నీలకు మేఘన



సాధుల మేఘన

ఖమ్మంస్పోర్ట్స్: ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఖమ్మానికి చెందిన సాధుల మేఘన అర్హత సాధించింది. జర్మనీ, కొరియా దేశాల్లో జరగనున్న జూనియర్ మహిళల 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగం పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఖమ్మం హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి వరకు, కేంద్రీయ విద్యాలయ సమితిలో ఇంటర్ పూర్తిచేసిన మేఘన, ఇప్పటికే రెండు సార్లు ఆర్చరీ జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో శిక్షణ పొందుతోంది. ఖమ్మంలో సీఐగా విధులు నిర్వర్తించిన తండ్రి సాధుల సారంగపాణి, ఆర్చరీ అసోసియేషన్ బాధ్యుడు పుట్టా శంకరయ్య వద్ద శిక్షణ తీసుకుని ప్రతిభ చాటుతున్న ఆమెను పలువురు అభినందించారు.

సత్తా చాటిన 'నవోదయ' విద్యార్థులు



నిఖిల్



జ్యోషిక

కూసుమంచి: సీబీఎస్‌ఈ పదో తరగతి, 12వ తరగతి (ప్లస్–2) ఫలితాలు శుక్రవారం విడుదల కాగా పాలేరులోని జవహర్ నవోదయ విద్యార్థులు సత్తా చాటారు. పదో తరగతిలో విద్యాలయ నుంచి 75 మంది విద్యార్థులు పరీక్ష రాయగా వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో కె.నిఖిల్, జి.జ్యోషిక 96.2 శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఇక 12వ తరగతి పరీక్షలకు 73 మంది విద్యార్థులు హాజరుకాగా 72 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో ధరణి 88 శాతం, యశోధర 79 శాతం మార్కులతో టాపర్లుగా నిలవగా విద్యార్థులను ప్రిన్సిపాల్ చంద్రబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

త్వరలో భద్రాద్రి జిల్లాకు గవర్నర్?

భద్రాచలం: రాష్ట్ర గవర్నర్ తమిళిసై త్వరలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు వచ్చే అవకాశముందని సమాచారం. ఈనెల 11న గవర్నర్ భద్రాచలం వస్తారని కొద్దిరోజుల కిందట అధికారులు వెల్లడించినా ఆ తర్వాత వాయిదా పడింది. కాగా, ఈ నెల 14 లేదా 17వ తేదీన గవర్నర్ పాల్వంచ, భద్రాచలం పర్యటనకు వస్తున్నారని తెలిసింది. అయితే, ఈ విషయాన్ని జిల్లా అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

అటు నష్టం.. ఇటు భారం

- అకాల వర్షంతో దెబ్బతిన్న కూరగాయల పంటలు
- పలుచోట్ల పంటలు వదిలేసిన రైతులు
- ఫలితంగా మార్కెట్‌లో కొరత, పెరిగిన ధర

ఖమ్మంవ్యవసాయం: అకాల వర్షాలు అన్ని రకాల పంటలను ఆగమాగం చేశాయి. ఈదురుగాలులు, అకాల వర్షాలు, వడగళ్ల వానలతో చేతికందే పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. సాధారణంగా మే, జూన్ నెలల్లో ఈదురుగాలులు, అకాల వర్షాలు కురుస్తుంటాయి. కానీ ఈసారి మార్చి, ఏప్రిల్‌లోనూ ఈ పరిస్థితి నెలకొనడంతో వాణిజ్య పంటలకు తోడు కూరగాయలు, ఆకుకూరల పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో దాదాపు నాలుగు వేల ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరల పంటల సాగు ఉండగా.. అత్యధిక శాతం పంటలు దెబ్బతిన్న కారణంగా మార్కెట్‌లో కూరగాయల కొరత ఏర్పడింది.

వేసవి పంటలు వర్షార్పణం

యాసంగి సీజన్‌లో సాగు చేసిన దాదాపు అన్ని పంటలు దెబ్బతిన్నాయి. ఖమ్మం జిల్లాలో కూరగాయలు, ఆకుకూరల పంటల సాగు ఎక్కువగా ఉంటుంది. ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, కామేపల్లి, కొణిజర్ల, బోనకల్, చింతకాని, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఏన్కూరు తదితర మండలాలే కాక భద్రాద్రి జిల్లాలోని సుజాతనగర్, జూలూరుపాడు, కొత్తగూడెం, పాల్వంచ, టేకులపల్లి, ఇల్లెందు, అశ్వారావుపేట తదితర మండలాల్లో కూరగాయల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. ఆయా మండలాల నుంచి విజయవాడ, గుంటూరు, రాజమండ్రికి కూడా కూరగాయలు ఎగుమతి చేస్తారు. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో చేతికొచ్చేలా రైతులు కూరగాయలు సాగు చేస్తుండగా.. అంతా బాగుందనుకున్న తరుణాన ప్రకృతి కాటేసింది. పందిర్లు, నేలపైన సాగు చేసిన పంటలను ఈదురుగాలులు, అకాల వర్షాలు, వడగళ్ల వానలు దెబ్బతీశాయి.



ఖమ్మం రూరల్ మండలం వెంకటాయపాలెంలో వదిలేసిన వంగ తోట



ఖమ్మం మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు


ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం

అన్నీ అనుకూలిస్తే ఎకరా కూరగాయల సాగుతో రైతులకు రూ.లక్ష వరకు ఆదాయం ఉంటుంది. కానీ వర్షాల కారణంగా పెట్టుబడి కూడా దక్కలేదు. ఉద్యానశాఖ లెక్కల ప్రకారం టమాటా, బెండ, వంగ, కాకర కూరగాయల పంటల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండగా.. అకాల వర్షాలు, వడగళ్ల వానతో దెబ్బతిన్నాయి. ప్రధాన టమాటా పంట దెబ్బతినగా.. మిగిలిన పంట నాణ్యత లేకపోవడంతో అమ్మడానికి వీలవడం లేదు. ఫలితంగా చాలా చోట్ల రైతులు పంటలను చేన్లలోనే వదిలేశారు. దీంతో కర్ణాటక రాష్ట్రంలో పందిర్లపై సాగు చేసే టమాటాను, బీర, కాకర, మునగను తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తెప్పించి అమ్ముతున్నారు. ఈ కారణంగా మార్కెట్లలో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో కిలో రూ.10 నుంచి రూ.20 ఉండే టమాట, బెండ, బీర, వంగ, కాకర వంటి కూరగాయల ధర ప్రస్తుతం రూ.20 నుంచి రూ.50 వరకు పలుకుతోంది.

రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలోకు రూ.ల్లో)


కూరగాయలు	ధర
టమాటా	24
వంకాయ	20
బెండకాయ	26
పచ్చిమిర్చి	50
కాకరకాయ	40
బీరకాయ	50
దొండకాయ	30
నాటు దోస	26
పొట్లకాయ	40
గోరుచిక్కుడు	50
క్యాప్సికం	50
క్యారెట్	36

కూరగాయల పంటలు తొలగించాం




అకాల వర్షాలతో పది ఎకరాలకు పైగా టమాట, బెండ, దొండ, వంగ పంట దెబ్బతినడంతో తొలగించాం. వర్షంతో టమాట పంట పూర్తిగా నాణ్యత కోల్పోయింది. పంటలు చేతికందే సమయంలో కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది.
– చెరుకూరి రామారావు, రైతు, కోయచెలక

పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి



తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల పంటలు దెబ్బతినగా.. మిగిలిన చోట నాణ్యత లేదు. దీంతో కర్ణాటక నుంచి టమాటా, బీర, వంగ, కాకరను తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఇంకొన్ని రోజులైతే టమాటా ఆశించిన మేర దొరకకపోవచ్చు.
–తోట రామారావు, కూరగాయల వ్యాపారి, ఖమ్మం

నాణ్యత లేవు.. ధరలు పెరిగాయి



కొద్ది రోజులుగా ఏ మార్కెట్‌కు వెళ్లినా కూరగాయలు నాణ్యతగా ఉండడం లేదు. దీనికి తోడు దాదాపు అన్ని కూరగాయల ధరలు పెరిగాయి. అకాల వర్షాలతో ఈ పరిస్థితి నెలకొందని విక్రయదారులు చెబుతున్నారు. నాటు టమాటా అసలు మార్కెట్‌లోనే లభించడం లేదు.
– గాజుల భారతి శ్రీనివాస్, ఖమ్మం

గోదావరి పరవళ్లు!

వేసవికాలం.. మే నెలలో ప్రాజెక్టులు, వాగులు, వంకలు నీరు అడుగంటడం సహజం. కానీ అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం సమీపాన దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద మాత్రం గోదావరి పరవళ్లు తొక్కుతోంది. మేడిగడ్డ నుంచి రెండు రోజుల కిందట దిగువకు నీరు వదిలారు. దీంతో గురువారం సాయంత్రం నుంచి గోదావరిలో నీటి మట్టం క్రమంగా పెరుగుతూ ఆనకట్ట పైనుంచి జారుతున్న నీటితో జలపాతంలా కనివిందు చేస్తోంది. – అశ్వాపురం



పనుల్లో వేగం పెంచండి

- వర్షాలు పడితే గ్రామాల్లో ఇబ్బందులు రావొద్దు
- ఇంజనీరింగ్ అధికారులకు పీఓ గౌతమ్ ఆదేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీఓ గౌతమ్

భద్రాచలం: ఐటీడీఏ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని ఏజెన్సీ గ్రామాల్లో చేపడుతున్న పనుల్లో వేగం పెంచాలని, త్వరితగతిన పూర్తి చేయాలని పీఓ గౌతమ్ పొట్రు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఐటీడీఏ సమావేశ మందిరంలో పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలం రానున్న నేపథ్యంలో గిరిజనులు ఇబ్బంది పడకుండా పనులను సకాలంలో చేయాలని సూచించారు. 121 గిరిజన గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 178. 49 కోట్లు మంజూరయ్యాయని, వర్షాకాలం రాకముందే రోడ్లు నిర్మించాలని అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం కింద చేపట్టబోయే పనులకు వెంటనే టెండర్లు పిలవాలన్నారు. ఈ పనులకు రూ. 28.50 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. గిరిజన గ్రామాలలో సబ్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రసూతి వార్డులు తదితర భవన నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. వైరాలో నిర్మిస్తున్న గిరిజన భవనాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. 199 గిరిజన గ్రామాలకు రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయని, స్థానిక సర్పంచ్‌లతో కలిసి అభివృద్ధి పనులకు టెండర్లు పిలవాలని సూచించారు. ఆరు గురుకుల పాఠశాలల్లో అదనపు గదులు, ఇతర సౌకర్యాల కోసం రూ. 5 కోట్లు మంజూరయ్యాయని, ఆ పాఠశాలల లేఔట్‌లు, రిపేర్లకు ప్రతిపాదనలు తనకు సమర్పించాలని తెలిపారు. పనుల్లో అశ్రద్ధ చేసినా, నాసిరకంగా నిర్మాణాలు చేపట్టినా కాంట్రాక్టర్లతో పాటు అధికారులపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ, డీఈలు రాములు, రామిరెడ్డి, ఏఈలు రాజు ,హరీష్ పాల్గొన్నారు.

గ్రంథాలయ పరిషత్ ప్రారంభోత్సవంలో చైర్మన్లు

ఖమ్మంగాంధీచౌక్/ఇల్లెందు: హైదరాబాద్‌లో శుక్రవారం గ్రంథాలయ పరిషత్ కార్యాలయాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్లతో సమావేశమై లైబ్రరీల పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్లు కొత్తూరు ఉమామహేశ్వరరావు, దిండిగాల రాజేందర్ పాల్గొన్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉమామహేశ్వరరావు, రాజేందర్

ప్రైవేటీకరణకు మూలం విద్యలోనే ఉంది..

ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ బుర్రా రమేశ్

ఖమ్మంసహకారనగర్: మనిషిలో ఉన్న వ్యక్తివాదాన్ని విద్య తట్టిలేపుతుందని.. తద్వారా సమాజంలో సమష్టివాదానికి బదులు వ్యక్తివాదం ముందుకొస్తూ ప్రైవేటీకరణకు విద్య సాధనంగా మారిందని భోపాల్ ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ బుర్రా రమేశ్ అభిప్రాయపడ్డారు. ఖమ్మం జెడ్పీహాల్‌లో టీపీటీఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం 'విద్య ప్రైవేటీకరణ – ప్రైవేటీకరణలో విద్య' అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచీకరణ తర్వాత విద్యలో వ్యక్తివాదాన్ని ముందుకు తీసుకొచ్చి అదే నిజమైందని చెబుతున్నారని పేర్కొన్నారు. మానవ, శాస్త్ర సాంకేతిక పరిశోధనలతో సృష్టించబడిన ఉపకరణాలు మనుషులు సమష్టిగా చేసే పనిని వ్యక్తిగా చేయటానికి దోహదపడుతున్నాయని.. మనిషికి స్వేచ్ఛను ఇచ్చి సమాజం నుంచి దూరం చేస్తున్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వ్యక్తికి, సమాజానికి మధ్య వచ్చే సంఘర్షణలో సమాజం వైపు నిలబడేలా తరగతి గదిని మార్చాలని కోరారు. ఈ సదస్సుకు టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ అధ్యక్షత వహించగా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులుతో పాటు మనోహర్ రాజు, రామారావు, ఎస్.వెంకటేశ్వరరావు, నర్సింహారావు, ప్రసాద్‌రావు, వెంగళరావు, ఏపీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రమేశ్